సాక్షి కామారెడ్డి

ఆదివారం । 12 । మార్చి । 2023



ఇళ్ల సమీపంలో పేలుళ్లు

పిట్లం మండలంలోని గౌరారంలో జనావాసాల మధ్య బండలను పేల్చేస్తున్నారు. దీంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

- 8లో ▸



బండి దిష్టిబొమ్మ దహనం

ఎమ్మెల్సీ కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు బీఆర్ఎస్ నేతలు నిరసన తెలిపారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం

36.8 /16.2

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కేటీఆర్ పర్యటన వాయిదా

నిజాంసాగర్: మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ జుక్కల్ నియోజకవర్గ పర్యటన వాయిదా పడింది. ముందుగా నిర్ణయించిన ప్రకారం ఆయన సోమవారం నిజాంసాగర్, పిట్లం మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉంది. అయితే కేటీఆర్ ఢిల్లీ పర్యటనలో ఉన్నందున నిజాంసాగర్ పర్యటనను వాయిదా వేసుకున్నారని బీఆర్ఎస్ మండల నాయకుడు దుర్గారెడ్డి శనివారం తెలిపారు. తిరిగి ఎప్పుడు వచ్చేది త్వరలోనే ప్రకటిస్తారని పేర్కొన్నారు.

టీఎస్ఆర్‌జేసీ సెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

లింగంపేట: టీఎస్ఆర్‌జేసీ సెట్‌కు ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని టీఎస్ఆర్‌జేసీ(బాలుర) పోచంపాడ్ ప్రిన్సిపాల్ తారాసింగ్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. తెలంగాణ గురుకుల విద్యా సంస్థల(విద్యాశాఖ) ఆధ్వర్యంలో నడిచే 35 గురుకుల కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కోసం ఈ సెట్ నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ (ఇంగ్లీష్ మీడియం)లలో ప్రవేశం కోసం ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు రాయబోతున్న బాలబాలికలు ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 040-24734899, 9866559693లలో సంప్రదించాలని సూచించారు.

'పోచారం' ప్రాజెక్టుకు రెయిలింగ్



నాగిరెడ్డిపేట: ప్రాజెక్టు పైనుంచి పర్యాటకులు నడిచే క్రమంలో వారికి ఎలాంటి ప్రమాదం జరగకుండా ఉండేందుకు నీటిపారుదలశాఖ అధికారులు రక్షణ చర్యలు చేపట్టారు. ప్రాజెక్టు గేట్ల వద్ద రూ. 7.80 లక్షలతో సుమారు 70 మీటర్ల మేర రెయిలింగ్‌ను ఏర్పాటు చేయిస్తున్నారు. ఈ పనులు దాదాపు పూర్తికావచ్చాయి.

వేతనాల కోసం ఆందోళన



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్ర ఆస్పత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు వేతన బకాయిల కోసం ఆందోళన చేపట్టారు. శనివారం ఆస్పత్రి ముందు బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 3 నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందిపడుతున్నామన్నారు. బకాయిలు చెల్లించాలని కోరారు. లేకపోతే నిరవధిక సమ్మె చేస్తామన్నారు.

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

డిచ్‌పల్లి(మోపాల్): మోపాల్ మండలం నర్సింగ్‌పూర్‌లోని ఇందూరు తిరుమల ఆలయంలో సోమవారం నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 16న శ్రీవారి కళ్యాణోత్సవం నిర్వహించనున్నారు. 19న బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

సండే స్పెషల్

ఆధ్యాత్మిక ధామం..

త్రివేణి సంగమం

- కందకుర్తి వద్ద గోదావరి, మంజీర, హరిద్ర నదుల కలయిక
- నాటి 'స్కంద కుడతి' నేటి 'కందకుర్తి'
- ఐదు భాషలు, విభిన్న సంస్కృతులు పాటించే ప్రజలు
- త్రేతాయుగం నుంచి అనేక చారిత్రక అంశాలను ఇముడ్చుకున్న ప్రాంతం
- కార్తీక, శ్రావణ మాసాల్లో ప్రతి సోమవారం గోదావరికి హారతి
- స్మృతి కేంద్రంగా ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు కేశవరావ్ బలిరామ్ హెడ్గేవార్ పూర్వీకుల ఇల్లు



కందకుర్తి వద్ద త్రివేణి సంగమం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నదుల సమీపంలో నాగరికతలు అభివృద్ధి చెందినట్లు చరిత్ర చెబుతుంది. అయితే భారతీయులు మాత్రం నదులను దేవతలుగా కొలుస్తారు. ఇక త్రివేణి సంగమం(మూడు నదుల కలయిక) అయితే అత్యంత పవిత్రంగా భావిస్తారు. కాగా నిజామాబాద్ జిల్లాలోని రెంజల్ మండలం కందకుర్తి వద్ద గోదావరి, మంజీర, హరిద్ర(హల్దీ) నదుల సంగమం అనేక పౌరాణిక, చారిత్రక అంశాలకు సాక్షిగా నిలుస్తోంది. తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నడుమ త్రివేణి సంగమం చోటుచేసుకుంటోంది. ఈ ప్రాంత ప్రజలు తెలుగు, కన్నడ, మరాఠీ, హిందీ, ఉర్దూ భాషలు మాట్లాడడం విశేషం. మూడు రాష్ట్రాల సరిహద్దు కావడంతో మూడు ప్రాంతీయ భాషలు, జాతీయ భాష హిందీ, అదేవిధంగా గతంలో నైజాం పాలన కారణంగా ఉర్దూ మాట్లాడుతున్నారు. భిన్న సంస్కృతులు సైతం నెలకొన్నాయి. ఇక త్రివేణి సంగమం దిగువన ప్రతి కార్తీక, శ్రావణ మాసాల్లో ప్రతి సోమవారం గోదావరి మాతకు నదీ హారతి ఇస్తున్నారు. కందకుర్తిలోని కేశవ సేవాసమితి ఆధ్వర్యంలో 1989 నుంచి ఈ నదీ హారతి కార్యక్రమం కొనసాగుతూ వస్తోంది.

మూడు రాష్ట్రాల నుంచి మూడు నదులు..

త్రివేణి సంగమంలో భాగమైన గోదావరి నది మహారాష్ట్రలోని నాసిక్ వద్ద బ్రహ్మగిరి పర్వతశ్రేణుల్లో పుట్టి మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో 1,465 కిలోమీటర్లు ప్రవహించి ఏపీలోని కోనసీమ జిల్లాలో బంగాళాఖాతంలో కలుస్తుంది. మంజీర నది మహారాష్ట్రలోని బీడ్ జిల్లా పటోడా తాలూకాలోని బాలాఘాట్ పర్వతశ్రేణుల్లో పుట్టి మహారాష్ట్ర, కర్ణాటక మీదుగా 742 కిలోమీటర్లు ప్రవహించి కందకుర్తి వద్ద గోదావరిలో కలుస్తుంది. ఇక హరిద్ర నది తెలంగాణ రాష్ట్రంలోని మెదక్ జిల్లాలో పుట్టి 150 కిలోమీటర్లు ప్రవహించి కందకుర్తి వద్ద గోదావరిలో కలుస్తుంది.



గోదావరి వద్ద శివాలయం

కుడతి అంటే కలయిక..

పౌరాణిక కాలం నుంచి ఇక్కడ స్కందుడి(కార్తికేయుడి) ఆలయం ఉండేది. అలాగే ఇక్కడ నదుల కలయిక నేపథ్యంలో 'కుడతి' అనేవారు. కన్నడ భాషలో కుడతి అంటే కలయిక అని అర్థం. దీంతో ఈ గ్రామానికి 'స్కంద కుడతి' అనే పేరు వచ్చింది. కాలక్రమంలో 'స్కంద కుడతి' కాస్తా 'కందకుర్తి'గా మారి అదే పేరు స్థిరపడింది. కాగా పురాణాల ప్రకారం శ్రీరాముడు వనవాసం సమయంలో కందకుర్తి ప్రాంతంలో కొంతకాలం ఉన్నట్లు చెబుతారు. ఇక మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ ఈ ప్రాంతాన్ని సందర్శించినట్లు చరిత్ర చెబుతోంది. అదే విధంగా మొగలుల పాలనా కాలంలో ఇండోర్ రాణి అహల్యాబాయి హోళ్కర్ కట్టించిన శివాలయం ప్రస్తుతం గోదావరి ఒడ్డున జీర్ణదశలో ఉంది. దీనిని పునరుద్ధరించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక శ్రీధర్ మహరాజ్ మఠం ఆధ్వర్యంలో ఇక్కడ ఉన్న శ్రీరామాలయంలో అనేక కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఛత్రపతి శివాజీ గురువు సమర్థ రామదాసు నిర్మించిన ఈ ఆలయం జీర్ణం కావడంతో పునరుద్ధరించారు. ఈ ఆలయానికి పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు.

స్మృతి కేంద్రంగా..

1925లో విజయదశమి రోజుల నాగ్‌పూర్‌లో ఆర్ఎస్ఎస్ స్థాపించిన కేశవరామ్ బలిరామ్‌పంత్ హెడ్గేవార్ పూర్వీకుల ఇల్లు కందకుర్తిలో ఉంది. 2025 విజయదశమికి ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించి వందేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో దీన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు సంఘ్ నిర్ణయించింది. హెడ్గేవార్ తాత నరసింహశాస్త్రి కట్టించిన ఇల్లు ఇది. వారి ఇంటి దైవం కేశవమూర్తి కావడంతో హెడ్గేవార్‌కు కేశవరామ్ బలిరామ్‌పంత్ హెడ్గేవార్ అని పేరు పెట్టుకున్నారు. కాగా కందకర్తిలో శ్రీ కేశవ శిశు విద్యామందిర్ పాఠశాలను నిర్వహిస్తున్నారు.



హెడ్గేవార్ స్మృతిమందిరం (పూర్వీకుల ఇల్లు)



స్మృతిమందిరంలోని విగ్రహాలు



కందకుర్తిలోని శ్రీరామాలయం

నిప్పెలా రాజుకుంది?

యాసంగి ధాన్యం సేకరణ కోసం కొనుగోలు చేసిన గన్నీ బ్యాగులను నిల్వ చేసిన గోదాంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. 2.75 లక్షల సంచులు కాలిబూడిదయ్యాయి. కోట్లాది రూపాయల ఆస్తినష్టం సంభవించింది. అయితే విద్యుత్ సౌకర్యం కూడా లేని గోదాంలో అగ్ని ప్రమాదం ఎలా సంభవించిందన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఈ సంఘటనలో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. రూ. కోట్ల విలువైన గన్నీ బ్యాగులు నిల్వ చేసినచోట ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.

- గోదాంలో అగ్నిప్రమాదం లేవనెత్తుతున్న ప్రశ్నలెన్నో..
- సెక్యూరిటీ ఊసులేదు.. సీసీ కెమెరాల జాడ కరువు
- నిర్లక్ష్యానికి 2.75 లక్షల గన్నీ సంచులు బుగ్గిపాలు
- మంటలతో గోదాములకూ డ్యామేజీ

సాక్షి, కామారెడ్డి: కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై లింగంపేట మండలంలోని ఎల్లారం శివారులో మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన గోదాములను పౌరసరఫరాల సంస్థ అద్దెకు తీసుకుంది. డిసెంబర్‌లో కొత్తగా కొనుగోలు చేసిన 5,345 గన్నీ బ్యాగుల బండిళ్లను ఈ గోదాములో నిల్వ చేసింది. ఒక్కో బండిల్‌లో 5 వందల బ్యాగులున్నాయి. 26,72,500 గన్నీ బ్యాగులు నిల్వ చేసినట్లు అధికారులు తెలిపారు. గోదాముల నుంచి శుక్రవారం సాయంత్రం పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు వెంటనే అధికారులకు సమాచారం అందించారు. రెవెన్యూ, పోలీస్, పౌరసరఫరాలు, అగ్నిమాపక శాఖల అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. గోదాం గేట్లు, డోర్లను తీసి ఫైర్ ఇంజన్ల సాయంతో రాత్రంతా నీళ్లు కొట్టించారు. అయితే గన్నీ బ్యాగుల్లో మంటలు ఎంతకూ చల్లారలేదు. శనివారం ఉదయం పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ అభిషేక్, అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి గౌతం తదితరులు మంటలను అదుపులోకి తీసుకురావాలంటే గోదాములో కాలుతున్న గన్నీలను బయటకు తీసుకురావాలన్న నిర్ణయానికి వచ్చి, పొక్లెయిన్‌ను తీసుకువచ్చి గోదాం గోడలను పగులగొట్టించారు. అనంతరం పొక్లెయిన్, ట్రాక్టర్ల సాయంతో గన్నీ బండిళ్లను బయటకు తీసుకువచ్చారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గన్నీ బండిళ్లను బయటకు తీసుకువచ్చి ఫైర్ ఇంజన్ల సాయంతో నీళ్లు పట్టి మంటలను అదుపులోకి తెచ్చారు.



గోదాం గోడలను పగులగొడుతున్న దృశ్యం

రూ. 2.21 కోట్ల సంచులు బుగ్గి..

గోదాము మధ్య భాగంలో నిల్వ ఉంచిన 550 బండిళ్లకు నిప్పంటుకుంది. ఆ బండిళ్లలో 2.75 లక్షల గన్నీ బ్యాగులున్నాయి. అగ్ని ప్రమాదంలో అవన్నీ కాలిపోయాయి. ఒక్కో గన్నీ బ్యాగు ధర రూ.80.50 ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ లెక్కన దాదాపు రూ. 2.21 కోట్ల విలువైన సంచులు కాలిపోయాయని పేర్కొన్నారు. గన్నీ బ్యాగులకు నిప్పంటుకోవడంతో గోదాముకూ నష్టం వాటిల్లుతుందంటున్నారు. గన్నీ బ్యాగులకు మంటలు అంటుకోవడంతో విపరీతమైన వేడి వెలువడింది. దీంతో గోదాములు చాలావరకు దెబ్బతిన్నాయని అధికారులు పేర్కొంటున్నారు. మంటలను అదుపు చేయడం సాధ్యం కాకపోవడంతో గోదాముకు రెండు పక్కలా గోడలను పగులగొట్టించారు. డోర్లు, కిటికీలను తొలగించారు. గోదాముకు ఎంత మేర నష్టం వాటిల్లిందనేది అంచనా వేయలేకపోతున్నారు.



గోదాం గోడలను బద్దలు కొట్టి గన్నీ బ్యాగులను బయటకు తీస్తున్న దృశ్యం

ప్రమాదమా... కుట్రా?

గోదాముకు విద్యుత్ సౌకర్యం లేదు. దీంతో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగే అవకాశం లేదు. అలాంటప్పుడు మంటలు ఎలా చెలరేగాయన్నది అంతుచిక్కడం లేదు. ఏదేని ప్రమాదమా లేక ఎవరైనా నిప్పంటించారా అన్నదానిపై అధికారులు ఆరా తీస్తున్నారు. గన్నీ బ్యాగులు తయారు చేసే సమయంలో పలు కెమికల్స్ వాడతారని, గోదాములో నిల్వ ఉంచడంతో ఆ రసాయనాలతో ప్రమాదం జరిగి ఉండే అవకాశాలున్నాయని అధికారులు భావిస్తున్నారు. గోదాముల వద్ద ఎలాంటి సెక్యూరిటీ లేకపోవడంతో అక్కడ మద్యం సేవిస్తారని చెబుతున్నారు. గోదాంకు వెనుక వైపున కిటికీకి ఉన్న చిన్న రంధ్రం గుండా ఎవరైనా ఆకతాయిలు నిప్పు పెట్టారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రక్షణ చర్యలు శూన్యం..

గోదాముల్లో రూ. కోట్ల విలువైన గన్నీ బ్యాగులు నిల్వ చేసినపుడు అక్కడ కనీసం సెక్యూరిటీ గార్డును కూడా నియమించలేదు. సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేయలేదు. చుట్టూ ప్రహరీ నిర్మించినా గేటు ఏర్పాటు చేయలేదు. సరైన రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో అది ప్రమాదవశాత్తు జరిగిందా? ఎవరైనా నిప్పు పెట్టారా అన్నది అంతుచిక్కడం లేదు. అయితే సెక్యూరిటీ కోసం ఉన్నతాధికారులకు నివేదించామని సివిల్ సప్లైస్ డీఎం అభిషేక్ పేర్కొన్నారు. ప్రమాదం ఎలా జరిగిందన్న దానిపై లోతైన దర్యాప్తు జరపాల్సిన అవసరం ఉంది.

రాపిడితో ప్రమాదం!

లింగంపేట: గన్నీ బ్యాగుల గట్టల చుట్టూ ఉన్న ఇనుప పట్టీలు రాసుకోవడం, లేక ఒకదానిపై ఒకటి పెట్టడంతో ఒత్తిడి వల్ల గోదాములో అగ్ని ప్రమాదం జరిగి ఉండొచ్చని ప్రాథమికంగా అంచనాకు వచ్చామని సివిల్ సప్లై డీఎం అభిషేక్ పేర్కొన్నారు. శనివారం ఆయన అగ్ని ప్రమాదం జరిగిన గోదామును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక గట్టకు 500 గన్నీ బ్యాగులను ఇనుప పట్టీలతో బిగించి ప్యాక్ చేస్తారన్నారు. గన్నీ బ్యాగుల తయారీలో వాడే కెమికల్స్, ఇనుప పట్టీల ఒత్తిడి, లేదా ప్యాక్ చేసిన గట్టలు ఒకదానిపై ఒకటి పెట్టడంతో రాపిడి జరిగి మంటలు చెలరేగి ఉంటాయన్న అనుమానాన్ని వ్యక్తం చేశారు. ఇలాగే గతంలో నల్గొండ జిల్లాలో సంఘటన జరిగిందని గుర్తు చేశారు. గోదాం మధ్య భాగంలో మంటలు చెలరేగాయని, మూడు లక్షల బ్యాగులు కాలిపోయాయని పేర్కొన్నారు. మంటలను ఆర్పడానికి రెండు పొక్లెయిన్లు, రెండు ట్రాక్టర్ల డోజర్లతో గోదాం గోడలు బద్దలు కొట్టి కాలుతున్న బ్యాగులను బయటకు తీసుకువచ్చామన్నారు. గోదాంలో ఇంకా 24 లక్షల వరకు గన్నీ బ్యాగులు ఉన్నాయన్నారు. వాటిని కాపాడడానికి అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కాగా మంటలను ఆర్పినా ఇంకా పొగలు వ్యాపిస్తూనే ఉన్నాయి. ఎల్లారం, ముస్తాపూర్ సర్పంచులు, ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్, సివిల్ సప్లై అధికారులు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

నిజామాబాద్‌కు చేరుకున్న రేవంత్‌రెడ్డి యాత్ర

- కమ్మర్‌పల్లిలో ఘనంగా స్వాగతం పలికిన కాంగ్రెస్ శ్రేణులు

కమ్మర్‌పల్లి: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర శనివారం రాత్రి కోరుట్ల నియోజకవర్గం మీదుగా నిజామాబాద్ జిల్లాలోకి ప్రవేశించింది. ఆయనకు కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్ క్రాస్ రోడ్ వద్ద డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్‌కుమార్, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి, నాయకులు తాహేర్ బిన్ హందాన్, గడుగు గంగాధర్, సీరడి భాగ్య, వేణు యాదవ్ ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి కార్యకర్తలు, నాయకులకు అభివాదం చేశారు. సీఎం రేవంత్ అంటూ కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలతో హోరెత్తించారు. రేవంత్‌రెడ్డి అక్కడి నుంచి బస ఏర్పాటు చేసిన చోటికి తన కాన్వాయ్‌లో బయలుదేరి వెళ్లారు. బస చేసే గుడారంలో నాయకులు రేవంత్‌తో ఫొటోలు దిగడానికి పోటీ పడ్డారు. తర్వాత ముఖ్య నాయకులతో రేవంత్ సమావేశమయ్యారు.



కమ్మర్‌పల్లిలో రేవంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి

మాచారెడ్డి అబ్బాయి వెడ్స్ అమెరికా అమ్మాయి



మాచారెడ్డి: అమెరికా అమ్మాయి మాచారెడ్డి అబ్బాయి వివాహానికి కామారెడ్డి పట్టణం వేదికైంది. మాచారెడ్డి మండల కేంద్రానికి చెందిన సిద్ధంశెట్టి గంగ, రమేశ్‌ల పెద్ద కుమారుడు సాయి సంకేత్ చదువుకోవడానికి అమెరికా వెళ్లాడు. అక్కడ సహాధ్యాయి అయిన కన్సిలో ఎలిజబెత్, ఫ్రాన్సిస్కో ఎర్నిస్టోల కూతురు రిషికతో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం కాస్తా ప్రేమగా మారింది. ఇరువురూ తమ తల్లిదండ్రులకు ప్రేమ విషయం చెప్పారు. ఇరు కుటుంబాలు వీరి ప్రేమకు అంగీకారం తెలపడంతో శనివారం రాత్రి కామారెడ్డిలోని సత్య గార్డెన్‌లో వివాహ వేడుకను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

త్వరలో పోడు పట్టాలు

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- బాన్సువాడలో రామారావ్ మహరాజ్ విగ్రహావిష్కరణ



నస్రుల్లాబాద్‌లో విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ చేస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ టౌన్: పోడు భూముల పంచాయితీ త్వరలో ముగుస్తుందని, అర్హులకు పట్టాలను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలో 1,833 మంది బంజారాలకు 3,390 ఎకరాలకు సంబంధించిన పట్టాలు అందుతాయన్నారు. శనివారం పట్టణంలోని సాయికృపానగర్ కాలనీ వద్ద ఏర్పాటు చేసిన రామారావ్ మహరాజ్ విగ్రహాన్ని స్పీకర్ ఆవిష్కరించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. రామారావ్ మహరాజ్ సమాజ శ్రేయస్సు కోసం అహర్నిషలు నిస్వార్థంగా కృషి చేశారని కొనియాడారు. బాన్సువాడ నియోజకవర్గంలో 80 తండాల్లో జగదాంబ, సేవాలాల్ మహరాజ్ మందిరాలు ఉన్నాయన్నారు. నియోజకవర్గానికి 11 వేల డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు అయితే 2,500 ఇళ్లు బంజారాలకే ఇచ్చామని పేర్కొన్నారు. అంతకుముందు గిరిజన విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శన ఇచ్చారు. కార్యక్రమంలో పౌరదేవి పీఠాధిపతి బాబుసింగ్ మహరాజ్, ఆల్‌ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు బద్యనాయక్, నాయకులు ప్రతాప్‌సింగ్, బాబురావ్, మోహన్‌నాయక్, సంగ్రాంనాయక్, బిక్క్యానాయక్, అంబర్‌సింగ్, బన్సీలాల్, భాస్కర్, రాముఠాథోడ్, చందర్, బల్‌రాంనాయక్, మోహన్‌నాయక్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



బాన్సువాడ సభలో పాల్గొన్న గిరిజనులు

విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమి పూజ

నస్రుల్లాబాద్: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో రామారావు మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన నిమిత్తం శనివారం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పౌరాదేవి పీఠాధిపతి బాబుసింగ్ మహరాజ్, ఎంపీపీ పాల్త్య విఠల్, జెడ్పీటీసీ జన్నుబాయి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం సురేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పెర్క శ్రీనివాస్, నాయకులు అంజిరెడ్డి, బద్యానాయక్, కంది మల్లేష్, రాము, మంగలి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తపాలా శాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



డిచ్‌పల్లి: తపాల శాఖ ద్వారా అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిజామాబాద్ సౌత్ సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌కుమార్ సూచించారు. శనివారం డిచ్‌పల్లి మండలం రాంపూర్ గ్రామంలో తపాల శాఖ అందిస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. తపాలా జీవిత బీమా (పీఎల్‌ఐ), గ్రామీణ తపాల బీమా (ఆర్‌పీఎల్‌ఐ) పథకాలు ఇతర బీమా సంస్థలతో పోలిస్తే తక్కువ ప్రీమియంతో ఎక్కువ బోనస్ అందిస్తున్నట్లు చెప్పారు. రాంపూర్ బీపీఎం స్వరూప, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ హాల్‌టికెట్లు ఆన్‌లైన్‌లో పెట్టాలి

నిజామాబాద్‌అర్బన్: ఇంటర్మీడియట్ విద్యార్థుల హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో పెట్టి విద్యార్థులే తీసుకునేలా చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు కోరారు. నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. పరీక్షల వేళ విద్యా సంస్థలు ఫీజుల వసూలు కోసం విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నాయన్నారు. ఫీజు కడితేనే హాల్ టికెట్లు ఇస్తామని ఒత్తిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యంతో సంబంధం లేకుండా ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు తీసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. పరీక్షలు రాసే విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు తిరుమలేష్, రాహుల్, ప్రణీత్, శశికుమార్, అబ్దుల్ కరీం, రాజేష్ పాల్గొన్నారు

విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దు

నిజామాబాద్‌అర్బన్: ఇంటర్మీడియట్ పరీక్షల సమయంలో విద్యార్థులను ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు హాల్ టికెట్ల పేరుతో ఇబ్బందులకు గురి చేయవద్దని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వేణు రాజు అన్నారు. ఈ మేరకు శనివారం ఇంటర్ విద్యాధికారికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పరీక్షల సమయంలో ఫీజులు పేరుతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు హాల్ టికెట్లు ఇవ్వమని విద్యార్థులను వేధింపులకు గురి చేస్తే సహించబోమన్నారు. ఫీజుల పేరుతో కాలేజీ యాజమాన్యాలు వేధించకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. నాయకులు నిఖిల్‌రెడ్డి, సయ్యద్ అష్రఫ్, శివ, ధనుష్ తదితరులు పాల్గొన్నారు.

కోడిపందాల స్థావరంపై దాడి

ఆర్మూర్‌టౌన్: మండలంలోని చేపూర్ శివారులో కోడి పందాలు ఆడుతున్న 15 మందిని శనివారం అరెస్టు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సురేష్ బాబు తెలిపారు. గ్రామ శివారులోని కోడిపందాలు ఆడుతున్నరనే సమాచారం మేరకు దాడులు చేశామన్నారు. వారి నుంచి 15 కార్లు, 17 ద్విచక్ర వాహనాలు రూ.లక్ష 90 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

- అదనపు డ్యూటీలతో సతమతం
- బోధన్ పోలీస్ డివిజన్‌లో పరిస్థితి

బోధన్‌టౌన్: మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలో ఉన్న బోధన్ పోలీస్ డివిజన్ కేంద్రంగా ఏర్పడినా.. సరిపడా సిబ్బంది లేక ఇబ్బందులు తప్పడం లేదు. ఈ డివిజన్ కేంద్రంలో రెండు సర్కిళ్లు, ఏడు పోలీస్ స్టేషన్‌లు ఉన్నాయి. కొత్తగా ఏర్పడిన మండలాలతో కలిసి మొత్తం పది మండలాలు ఉన్నాయి. డివిజన్ పరిధిలో ఒక పట్టణ పోలీస్ స్టేషన్‌తో పాటు ఆరు ఠాణాలు, రుద్రూర్, బోధన్ రూరల్ రెండు సర్కిల్ కేంద్రాలు ఉన్నాయి. ఈ డివిజన్ కేంద్రానికి మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలు ఆనుకొని ఉండడంతో ఈ ప్రాంతంలో నేరాలు కూడా అధికంగా ఉన్నాయి. అయితే సిబ్బంది కొరత వేధిస్తుండటంతో శాంతిభద్రతల పరిరక్షణ సవాలుగా మారింది.

మహారాష్ట్ర నుంచి గంజాయి..

డివిజన్ పరిధిలో మట్కా, పేకాట, దేశీదారు, గంజాయి తరహా కేసులు అధికంగా నమోదు అవుతున్నాయి. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలైన సాలూరా, కందకుర్తి వద్ద అంతరాష్ట్ర చెక్ పోస్టులు ఏర్పాటు చేసినా దేశీదారు, గంజాయి రవాణా ఆగడం లేదు. మంజీర, గోదావరి నదులు ఉండడంతో ఇసుక అక్రమ రవాణా రాత్రి పగలు తేడా లేకుండా సాగుతోంది. డివిజన్‌లో 242 నుంచి 300 వరకు సిబ్బంది ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 165 మంది మాత్రమే పనిచేస్తున్నారు. పండుగలు, ఉత్సవాలు, బందోబస్తుల సందర్భంగా ఉద్రిక్తలు తలెత్తే సందర్భాల్లో ఉన్న పోలీసులు సిబ్బంది రోజు



బోధన్‌లోని రూరల్ సీఐ కార్యాలయం

వారి డ్యూటీలతో పాటు అదనపు విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో కేసులు ఛేదించడంలో ఇబ్బందులు తలెత్తున్నాయి.

కొత్త మండలాల్లో ఠాణాలు కరువు

బోధన్ డివిజన్‌లో పోతంగల్, సాలూరా, చందూర్– మోస్రా నూతనంగా మండలాలుగా ఏర్పాటు అయ్యాయి. ఆయా మండల కేంద్రాల్లో ఇప్పటికీ పోలీస్ స్టేషన్‌లను ఏర్పాటు చేయలేదు. డివిజన్‌లో 242 నుంచి 300 మంది వరకు పోలీసులు ఉండాల్సి ఉండగా.. ఏసీపీ, పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోతో కలిపి ముగ్గురు సీఐలు, 11 మంది ఎస్సైలు, ఏఎస్‌ఐలు 15 మంది, హెడ్ కానిస్టేబుల్స్ 30 మంది, కానిస్టేబుల్స్ 104 మంది మొత్తం 165 మంది ఉన్నారు.

జాడలేని మహిళా పోలీస్ స్టేషన్

బోధన్‌లో ప్రత్యేక మహిళా పోలీస్ స్టేషన్ ఉండాల్సి ఉండగా ఇప్పటికీ కాగితాలకే పరిమితం అయింది. మహిళా హెడ్ కానిస్టేబుల్స్ ఉన్నప్పటికీ వారు మామూలు విధులకే పరిమితం అవుతున్నారు. ప్రతీ పోలీస్ స్టేషన్‌లో కుటుంబ తగాదాలకు సంబంధించి ఫిర్యాదులు వస్తున్నా పరిష్కారంలో తీవ్ర జాప్యం నెలకొంటుంది. డివిజన్ కేంద్రంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కూడా లేదు. ఉన్నత పోలీసు అధికారులు స్పందించి డివిజన్ కేంద్రానికి పూర్తి స్థాయిలో పోలీసు సిబ్బందిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం



బోధన్ డివిజన్ పరిధిలో సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించాలని ఉన్నత అధికారులకు ప్రతిపాదనలు పంపాం. పోలీస్ స్టేషన్‌లను తనిఖీ చేసినప్పుడు సిబ్బంది కొరత దృష్టికి వస్తుంది. ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారిస్తాం.

– కిరణ్‌కుమార్, ఏసీపీ

అక్రమ నియామకాలను రద్దు చేయాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ వీసీ రవీందర్ పై చర్యలు తీసుకోవాలని, అక్రమ నియామకాలను వెంటనే రద్దు చేయాలని భారతీయ విద్యార్థి మోర్చా (బీవీఎం) రాష్ట్ర కార్యదర్శి జీవీఎం విశల్ డిమాండ్ చేశారు. శనివారం బీవీఎం ఆధ్వర్యంలో తెయూ పరిపాలనా భవనం ఎదుట వీసీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా విశల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ అనుమతి లేకుండా కాసుల కోసం 135 మందికి పైగా సిబ్బందిని అక్రమంగా నియమించారని ఆరోపించారు. గతంలో ఇలాగే అక్రమ నియామకాలు చేపడితే విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తే అప్పటి విద్యాశాఖ కమిషనర్ నవీన్‌మిత్తల్ వాటిని రద్దు చేశారన్నారు. కొద్ది రోజులు మౌనంగా ఉన్న వీసీ మళ్లీ అక్రమ నియామకాలు చేపట్టడం సిగ్గు చేటన్నారు. ఒక్కో పోస్టుకు ఒక్కో రేటు చొప్పున డబ్బులు తీసుకుని నియామకాలు చేపడుతున్నారని ఆరోపించారు. వర్సిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న వర్సిటీ ఉన్నతాధికారులు, కమీషన్లు, కాసుల కోసం అవసరం లేకున్నా నియామకాలు చేపడుతున్నారని విమర్శించారు. గర్ల్స్ హాస్టల్‌లో గదులు సరిపోక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే నూతన బాలికల హాస్టల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెయూ బీవీఎం ఇన్‌చార్జి రమణ, సూరజ్, విజయ్, రవి, తరుణ్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న బీవీఎం నాయకులు

రేవంత్‌రెడ్డి పాదయాత్రను సక్సెస్ చేయండి



ఘన్‌పూర్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్‌రెడ్డి

డిచ్‌పల్లి : మండలంలో ఈనెల 14న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టనున్న పాదయాత్ర, కార్నర్ మీటింగ్‌ను సక్సెస్ చేయాలని మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కే.నగేశ్‌రెడ్డి కోరారు. శనివారం మండలంలోని ఘన్‌పూర్, డిచ్‌పల్లి, ధర్మారం(బి), నడిపల్లి తదితర గ్రామాలను సందర్శించి గ్రామస్తులు, స్థానిక కాంగ్రెస్ నాయకులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. 14న మోపాల్ నుంచి కంజర్, కులాస్‌పూర్, ముల్లంగి(ఐ), ఘన్‌పూర్ గ్రామాల మీదుగా పాదయాత్ర కొనసాగుతుందన్నారు. సాయంత్రం 7 గంటలకు డిచ్‌పల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద కార్నర్ మీటింగ్‌లో ప్రజల నుద్దేశించి రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తారని తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, జిల్లా నాయకులు ముప్పగంగారెడ్డి, శేఖర్‌గౌడ్, వాసు తదితరులు పాల్గొన్నారు.

పరిస్థితులు ఎదుగుదలకు ఆటంకం కాకూడదు



సిరికొండ: విద్యార్థి జీవితంలో ప్రాంతం, కుటుంబ నేపథ్యం, వ్యక్తిగత పరిస్థితులు ఏవీ కూడా మన ఎదుగుదలకు ఆటంకం కాకూడదని తెలంగాణ విశ్వవిద్యాలయం అర్థశాస్త్ర ప్రొఫెసర్ కె రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సత్యశోధక్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ మాట్లాడుతు విద్యార్థుల సానుకూల దృక్పథాన్ని అలవర్చుకొని ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమాజానికి మనుగడనిచ్చే మానవీయ విలువలు ఉన్న పౌరులుగా ఎదగాలని సూచించారు. విద్యార్థి దశలోనే భవిష్యత్తుకు బాటలు వేసుకుంటే మంచి స్థాయిలో ఉంటారని చెప్పారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపాల్ నర్సయ్య, పీజీ హెచ్‌ఎం నరేందర్, రెడ్‌క్రాస్ సభ్యులు సాల్మన్, రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బెదిరించిన వ్యక్తిపై ఫిర్యాదు

వర్ని: వర్ని మండలం శంకోరా గ్రామానికి చెందిన జార్పుల రాము అనే వ్యక్తి తనను చంపుతానని బెదిరించాడని చందూరు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అరుణ్ కుమార్ వర్ని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శంకోర అటవీ ప్రాంతంలో అక్రమంగా చెట్లను నరికివేసి భూమి కబ్జాకు పాల్పడుతున్న వ్యక్తిని ప్రశ్నించినందుకు తనను చంపి వేస్తానని బెదిరించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఇళ్ల సమీపంలో బండరాళ్ల పేలుళ్లు

- ఆందోళన చెందుతున్న గ్రామస్తులు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

పిట్లం(జుక్కల్): మండలంలోని గౌరారంలో జనావాసాల మధ్య బండరాళ్లను పేలుస్తున్నారు. దీంతో తమ ఇళ్లకు పగుళ్లు వస్తున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో ఇళ్ల పక్కనే పెద్ద బండరాళ్లు ఉన్నాయి. సదరు భూమిని ఇటీవల వేరే గ్రామానికి చెందిన కొనుగోలు చేశారు. ఆ బండరాళ్లను పగులగొట్టడానికి కొన్ని రోజులుగా మైనింగ్ చేస్తున్నారు. బండరాళ్లను పేలుస్తుండటంతో దగ్గరలో ఉన్న ఇళ్లకు పగుళ్లు ఏర్పడుతున్నాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోయారు. సదరు భూమిని కొనుగోలు చేసిన వారు పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని సైతం ఆక్రమిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇళ్ల మీద పడుతున్నాయి



మందుపాతరలు పెట్టి బండరాళ్లను పేలుస్తున్నారు. దీంతో ఆ బండరాళ్లు ఎగిరొచ్చి మా ఇళ్ల మీద పడుతున్నాయి. ఈ విషయమై కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. పేలుళ్లతో ఇళ్లకు పగుళ్లు వస్తున్నాయి. అధికారులు చర్యలు చేపట్టాలి.

– ఎల్లయ్య, గౌరారం



గౌరారంలో పగులగొట్టిన బండరాళ్లు

బహిష్కరణలకు పాల్పడితే చర్యలు

సిరికొండ: ఎవరిని సాంఘిక బహిష్కరణ చేయొద్దని, అలా చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ధర్పల్లి సీఐ సైదా హెచ్చరించారు. మండలంలోని న్యావనంది గ్రామంలో శుక్రవారం రాత్రి పోలీసు కళాజాత నిర్వహించారు. కళాకారులు తమ ఆట పాటలతో వివిధ అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అందరు అన్నదమ్ముల్లా శాంతియుతంగా కలిసిమెలిసి ఉండాలని కోరారు. రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, బైక్‌పై ప్రయాణించేవారు హెల్మెట్ ఖచ్చితంగా ధరించాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, ఏవైనా మోసాలు జరిగితే టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై నర్సింలు, ఏఎస్సై బాల్‌సింగ్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ సైదా

క్రీడల్లో గెలుపోటములు సహజం

పెర్కిట్(ఆర్మూర్) : క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత పవన్ అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో 37వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీలను చైర్ పర్సన్ ముఖ్య అతిథిగా హాజరై శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ క్రీడల్లో ఓడినవారు గెలుపొందిన వారిని ఆదర్శంగా తీసుకుని గెలవడానికి ప్రయత్నించాలన్నారు. హ్యాండ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పవన్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చిన వారిని జాతీయ స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అడహక్ కమిటి జిల్లా చైర్మన్ గంగామోహన్ చక్రు, కో–కన్వీనర్ రాజేష్, ఆర్గనైజింగ్ సెక్రెటరి సురేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్ను, పీఈటీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రెడ్డి, క్రీడాభివృద్ధి శాఖ అధికారి ముత్తన్న, బొబ్బిలి నర్సయ్య, బద్దం లింగారెడ్డి, కోడే శ్రీనివాస్, పీఈటీలు సునీత, రాజేందర్, చిన్నయ్య, శ్యాం, నరేంద్ర చారి, భూపతి, నగేష్, నరేందర్, సంతోష్ ఠాగూర్, రమణ, నాగేష్, రాజేందర్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడా పతాకాన్ని ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత పవన్

ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయింపు

రుద్రూర్(మోస్రా): మోస్రా మండలం గోవూర్ గ్రామానికి చెందిన గంగోత్రి (23) ప్రేమించిన యువకుడితో పెళ్లి జరిపించాలని శనివారం ప్రియుడి ఇంటి ఎదుట కుటుంబ సభ్యులతో కలిసి బైటాయించింది. గంగోత్రి తెలిపిన వివరాలు.. వేర్వేరు కులాలకు చెందిన నరేష్, గంగోత్రి తొమ్మిదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ప్రస్తుతం గంగోత్రి చదువుతుండగా నరేష్ డ్రైవింగ్ పని చేస్తున్నాడు. ఇద్దరు పెళ్లికి సిద్ధమవుతున్న తరుణంలో నరేష్ తల్లితండ్రులు మరోకరితో పెళ్లికి సన్నాహాలు చేస్తుండడంతో గంగోత్రి గ్రామ పెద్దలను ఆశ్రయించింది. గ్రామ పెద్దలు నరేష్ కుటుంబ సభ్యులను పిలిస్తే రాలేదు. దీంతో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సమస్యను విన్నవించింది. మూడు రోజులు గడుస్తున్నా నరేష్ తల్లిదండ్రులు పెళ్లికి అంగీకరించకపోవడం, ఫోన్ స్విచ్‌ఆఫ్ రావడంతో న్యాయం చేయాలని ప్రియుడి ఇంటి ఎదుట ధర్నా చేసింది.



గోవూర్‌లో ప్రియుడి ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న గంగోత్రి

ఉద్యోగం పోయిందని ఆత్మహత్య

కామారెడ్డిక్రైం: ఉద్యోగం పోవడంతో చేసిన అప్పులు తీర్చలేక మనోవేదనకు గురై ఒకరు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలో చోటుచేసుకుంది. వివరాలు.. గాంధారికి చెందిన వడ్ల శ్రీకాంత్ (35) ఓ కంపెనీలో మెడికల్ రిప్రెజెంటివ్‌గా పని చేస్తూ దేవునిపల్లిల్లో నివాసం ఉంటున్నాడు. అతనికి భార్య మౌనిక, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శ్రీకాంత్ ఇటీవల ఓ బ్యాంక్‌లో వ్యక్తిగత రుణం తీసుకున్నాడు. బయట కూడా కొన్ని అప్పులు చేసినట్లు తెలిసింది. 3 నెలల క్రితం ఉద్యోగం పోయింది. దీంతో అప్పులు చెల్లించలేక ఇబ్బందులు తప్పలేదు. అప్పుల విషయంలో పలుసార్లు భార్యా, భర్తల మధ్య గొడవలు జరిగాయి. హోళీ పండగ రోజున అతని భార్య, పిల్లలతో కలిసి అత్తగారింటికి లింగంపేట మండలం దేమె గ్రామానికి వెళ్లాడు. మరుసటి రోజు ఒక్కడే దేవునిపల్లికి వచ్చాడు. శనివారం ఉదయం అతని భార్య మౌనిక ఎన్నిసార్లు ఫోన్ చేసినా శ్రీకాంత్ ఎత్తకపోవడంతో దేమె నుంచి దేవునిపల్లి ఇంటికి వచ్చి చూసింది. అప్పటికే శ్రీకాంత్ హాల్‌లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దేవునిపల్లి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.



వడ్ల శ్రీకాంత్ (ఫైల్)

గ్యాస్ లీకై వృద్ధురాలికి తీవ్రగాయాలు

సిరికొండ: మండలంలోని పెద్దవాల్గోట్‌లో వంట చేస్తుండగా గ్యాస్ లీకై వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన నారవోయిన పోశన్న, నర్సవ్వ దంపతులు ఇందిరమ్మ కాలనీలో సిమెంట్ రేకుల ఇంట్లో నివాసం ఉంటున్నారు. శనివారం రాత్రి వంట చేస్తుండగా గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. ప్రమాదంలో వంట చేస్తున్న నర్సవ్వకు తల నుంచి మోకాళ్ల వరకు పూర్తిగా కాలి తీవ్ర గాయాలైనట్లు 108 సిబ్బంది తెలిపారు. నర్సవ్వను 108లో చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదంలో ఇంటి పైకప్పు రేకులు ధ్వంసమైనట్లు సర్పంచ్ గంగాదాసు తెలిపారు.



గాయపడ్డ వృద్ధురాలు

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ ఒకరి మృతి

రామారెడ్డి: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని గిద్ద గ్రామానికి చెందిన కొండాపురం బాలయ్య(50), ఆయన కుమారుడు రంజిత్ ఈ నెల 5న సదాశివనగర్ నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా ఉప్పల్‌వాయి శివారులో బైక్ అదుపు తప్పింది. ప్రమాదంలో బాలయ్య, రంజిత్ తీవ్రంగా గాయపడ్డారు. బాలయ్యను హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో యువకుడి గల్లంతు

నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన జువాలగారి సాయిబాబా(27) ప్రమాదవశాత్తు చెరువులో పడి గల్లంతు అయినట్లు స్థానికులు తెలిపారు. శుక్రవారం తిరుమల దేవస్థానం వద్ద మినీ ట్యాంకుబండ్‌లో కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లిన సాయిబాబా ప్రమాదవశాత్తు చెరువులో పడ్డాడు. యువకుడి కోసం జాలర్ల గాలిస్తున్నారు.

మహిళ అదృశ్యం

భిక్కనూరు: మండలంలోని భాగిర్తిపల్లి గ్రామానికి చెందిన మహిళ భర్తతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయిందని భిక్కనూరు ఎస్సై ఆనంద్‌గౌడ్ శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన మాల్గరి రాజయ్యకు మెదక్ జిల్లా నిజాంపేట మండలం నస్కల్ గ్రామానికి చెందిన యాదమ్మతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరూ పిల్లలు ఉన్నారు. ఈనెల 10న రాజయ్య యాదమ్మ గొడవపడ్డారు. ఈ విషయాన్ని యాదమ్మ తన సొదరి లక్ష్మికి ఫోన్‌లో తెలిపి పోలీస్ స్టేషన్‌కు వెళ్తున్నాని చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. ఆమె ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువుల ఇంట్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



ఎల్లారెడ్డి: నాగిరెడ్డిపేట అటవీశాఖ రేంజ్ పరిధిలోని కోమట్‌పల్లి అటవీ ప్రాంతం నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు అటవీశాఖ అధికారులు శనివారం తెలిపారు. శుక్రవారం రాత్రి సమయంలో కోమట్‌పల్లి నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని ఎల్లారెడ్డి అటవీశాఖ కార్యాలయానికి తరలించినట్లు పేర్కొన్నారు.

ఎల్లారెడ్డిలోని ముత్తూట్ ఫైనాన్స్‌పై కేసు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ముత్తూట్ ఫైనాన్స్‌పై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేష్ శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డి మున్సిపాలిటి పరిధిలోని గండిమాసానిపేట గ్రామానికి చెందిన మహేందర్‌గౌడ్ పట్టణంలోని ముత్తూట్ ఫైనాన్స్‌లో 47.6 గ్రాముల బంగారాన్ని తాకట్టు పెట్టి రూ.లక్ష 70 వేలు గత ఏప్రిల్ 25న రుణం తీసుకున్నాడు. సదరు వ్యక్తి ఫిబ్రవరి 23న రూ.1,71,138 ఫోన్ పే ద్వారా చెల్లించి బంగారం తీసుకున్నాడు. రెండు రోజుల తరువాత ఫిబ్రవరి 25న మళ్లీ ఫోన్‌పే నుంచి లక్ష 70 వేల రూపాయలు ముత్తూట్ ఫైనాన్స్ ఖాతాలో జమ అయ్యాయి. బ్యాంకు అధికారులను సంప్రదించగా ముత్తూట్ ఫైనాన్స్ వారి ఖాతాలో డబ్బులు రెండో మారు జమ అయ్యాయని చెప్పారు. ముత్తూట్ ఫైనాన్స్ సిబ్బందిని అడిగితే డబ్బులు రాలేదని సమాధానం చెబుతున్నారు. తన ఖాతా నుంచి ముత్తుట్ ఫైనాన్స్ వారు ఎలాంటి ఓటీపీ లేకుండా డబ్బులను తీశారని బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

సోలార్ పలకలు, బ్యాటరీలు చోరీ

లింగంపేట: మండలంలోని నల్లమడుగు, నల్లమడుగు పెద్ద తండాల శివారులోని పంట చేనుల వద్ద ఏర్పాటు చేసిన సోలార్ పలకలు, బ్యాటరీలు, సింగిల్ ఫేజ్ బోరు మోటారు చోరీకి గురైనట్లు ఎస్సై శంకర్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నల్లమడుగు పెద్ద తండాకు చెందిన ధారావత్ రమేష్, నల్లమడుగు గ్రామానికి చెందిన ఎట్టం మహేష్ తమ పొలాలకు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. దానికి కోసం అమర్చిన సోలార్ పలక, బ్యాటరీలను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. అలాగే సేవాలాల్ మందిరం వద్ద సింగిల్ ఫేజ్ మోటారును చోరీ చేశారు. బాధితుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.